సాక్షి తిరుపతి

బుధవారం। 25। జూన్। 2025



అంతా మా ఇష్టం..ధరలు చెప్పం!
జిల్లాలో పండ్ల గుజ్జు పరిశ్రమదారులు సిండికేట్‌గా మారడంతో గిట్టుబాటు ధరలు లభించక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. - 8లో



'ఉపాధి' అక్రమాలపై వేటు
రేణిగుంట మండలంలో ఉపాధి హామీ పనుల్లో జరిగిన అక్రమాలు సామాజిక తనిఖీలో బట్టబయలయ్యాయి. - 8లో



రౌడీషీటర్ దారుణహత్య
చిల్లకూరు మండలంలో ఇద్దరు పాత నేరస్థుల మధ్య జరిగిన గొడవ నేపథ్యంలో ఒకరు దారుణ హత్యకు గురయ్యాడు. - 8లో

న్యూస్‌రీల్

విద్యుత్ బస్సుల నిర్వహణపై అవగాహన



మాట్లాడుతున్న ఆర్టీసీ అధికారులు

తిరుపతి అర్బన్ : విద్యుత్ బస్సుల నిర్వహణపై అన్ని డిపోలకు చెందిన మేనేజర్లకు పూర్తి అవగాహన ఉండాలని ఆర్టీసీ కేంద్ర కార్యాలయ ముఖ్య అధికారి గద్దె నాగేశ్వరరావు తెలిపారు. తిరుపతి డీపీటీవో కార్యాలయంలో మంగళవారం జిల్లాలోని డీఎంలకు హైదరాబాద్ నుంచి వచ్చిన వీఎన్‌ఆర్ విజ్ఞానజ్యోతి ఇంజినీరింగ్ టెక్నాలజీ సంస్థకు చెందిన వారు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. జిల్లాలో ప్రస్తుతం వంద విద్యుత్ బస్సులను అలిపిరి డిపో నుంచి నిర్వహిస్తున్నారని చెప్పారు. కొత్తగా 50 విద్యుత్ బస్సులు జిల్లాకు రానున్నాయని...వాటిని మంగళం డిపో నుంచి నిర్వహిస్తారని వెల్లడించారు. కార్యక్రమంలో డీపీటీవో వెంకట్రావ్, డిప్యూటీ సీటీఎం విశ్వనాథ, డిప్యూటీ మెకానిక్ ఇంజినీర్ బాలాజీ, అలిపిరి డీఎం హరిబాబు పాల్గొన్నారు.

26,28,29 తేదీల్లో చెన్నై మెమో రైలు రద్దు

నాయుడుపేటటౌన్ : చెన్నై నుంచి నెల్లూరు వెళ్లే మెమో రైలు ఈనెల 26, 28, 29 తేదీల్లో రాకపోకలు రద్దు చేసినట్లు రైల్వే స్టేషన్ మేనేజర్ చిరంజీవి మంగళవారం తెలిపారు. పోన్నేరి తదితర ప్రాంతాల్లో రైల్వే లైన్ల మరమ్మతుల కారణంగా మెమో రైలు రద్దు చేసినట్లు రైల్వే ఉన్నతాధికారులు ప్రకటించినట్లు స్టేషన్ మేనేజర్ వెల్లడించారు. ఈ అసౌకర్యాన్ని రైల్వే ప్రయాణికులు తెలుసుకోవాలన్నారు.

నేడు డిప్లొమో కరికులంపై ప్రాంతీయ వర్క్‌షాప్

తిరుపతి ఎడ్యుకేషన్: రాష్ట్ర సాంకేతిక విద్య, శిక్షణా బోర్డు (ఎస్‌బీటీఈటీ) ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ డిప్లొమో కరికులంపై తిరుపతిలోని గోల్డెన్ తులీప్ హోటల్‌లో బుధవారం ప్రాంతీయ వర్క్‌షాపు నిర్వహించనున్నట్లు స్థానిక ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వర్క్‌షాప్‌కు సాంకేతిక విద్య డైరెక్టర్ జి.గణేష్‌కుమార్, ఎస్‌బీటీఈటీ కార్యదర్శి జీవీవీఎస్.మూర్తి, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ ఎంఏవీ.రామకృష్ణ, డెప్యూటీ కార్యదర్శి డాక్టర్ కె.లక్ష్మీపతి హాజరవుతారని, ఈ వర్క్‌షాప్‌లో పలువురు పారిశ్రామికవేత్తలు, యూనివర్సిటీ ప్రొఫెసర్లు, పాలిటెక్నిక్ ప్రిన్సిపాళ్లు, టీచర్లు పాల్గొని పాలిటెక్నిక్ డిప్లొమో విద్యార్థులకు అవసరమైన సిలబస్ తయారీపై చర్చించనున్నట్లు ఆయన తెలిపారు.

ఎస్వీయూను సందర్శించిన యూకే డిప్యూటీ హైకమిషనర్



వర్సిటీ అధికారులతో యూకే డిప్యూటీ హైకమిషనర్

తిరుపతి సిటీ: యునైటెడ్ కింగ్‌డమ్ డిప్యూటీ హైకమిషనర్ విన్ ఓవెన్ మంగళవారం ఎస్వీ యూనివర్సిటీని సందర్శించారు. ఆయన ఎస్వీయూ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడుతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ, భారతీయ పారిశ్రామిక రంగాలతో యూకే బలమైన భాగస్వామ్యాన్ని ఏర్పాటు చేసేందుకు అంకితభావంతో ఉందన్నారు. ఉమ్మడి పరిశోధన, విద్యామార్పిడి, వాణిజ్య వెంచర్ల కోసం స్పష్టమైన మార్గాలను అన్వేషించడం తన సందర్శన లక్ష్యమని చెప్పారు. ఏపీలో అమలవుతున్న విద్యా విధానం, అభివృద్ధి చెందుతున్న ఐటీ రంగంలో సహాయ సహకారాలకు ఉన్న అవకాశాలపై చర్చించారు. కార్యక్రమంలో వంశీకృష్ణ, లక్ష్మి, శ్రీనివాస్, శశికుమార్, డాక్టర్ వివేక్ తదతరులు పాల్గొన్నారు.

అగ్రికల్చర్ డిప్లొమా ప్రవేశాలకు 30 వరకు గడువు

తిరుపతి సిటీ: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలో 2025–26 విద్యా సంవత్సరానికి అగ్రికల్చర్ పాలిటెక్నిక్‌లో ప్రవేశాలు పొందేందుకు దరఖాస్తు గడువు ఈనెల 30 వరకు పొడిగించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.సుమతి ఒక ప్రకటనలో తెలిపారు. వాస్తవానికి ఈ నెల 16తో ప్రవేశాల గడువు ముగిసిందని, విద్యార్థుల సౌకర్యార్థం నెలాఖరు వరకు గడువు పెంచినట్లు చెప్పారు. అగ్రికల్చర్, ఆర్గానిక్, సీడ్ టెక్నాలజీ, అగ్రి ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలు పొందేందుకు విద్యార్థులు విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ డిప్లొమా కోర్సుల్లో చేరడానికి ఎలాంటి ప్రవేశ పరీక్ష ఉండదని, పదోతరగతిలో పొందిన మార్కుల ఆధారంగా సీట్లు కేటాయిస్తారని తెలియజేశారు.

విద్యాహక్కు అపహాస్యం

విద్యాహక్కు చట్టం ఉమ్మడి చిత్తూరు జిల్లాలో అపహాస్యం పాలవుతోంది. ఈ చట్టం మేరకు ప్రైవేటు, కార్పొరేటు పాఠశాలలో పేద పిల్లలకు 25 శాతం అడ్మిషన్లు ఉచితంగా కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం 2025–26 విద్యా సంవత్సరానికి ఉత్తర్వులు జారీ చేసింది. కానీ ప్రభుత్వ ఆదేశాలు, విద్యాహక్కు చట్టం నిబంధనలను యాజమాన్యాలు యథేచ్ఛగా ఉల్లంఘిస్తున్నా విద్యాశాఖ అధికారులు నోరు మెదపడం లేదు. నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకునే అధికారం ఉన్నా ఆ అధికారాన్ని వినియోగించకపోవడంపై పలు అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆర్టీఈని పకడ్బందీగా అమలు చేశారని తల్లిదండ్రులు గుర్తు చేసుకుంటుండడం గమనార్హం.



- జిల్లాలో మొక్కుబడిగా ఆర్టీఈ అడ్మిషన్లు
- పర్యవేక్షించే నాథుడే కరువు
- చిత్తూరు, తిరుపతి జిల్లాలో 3978 సీట్లు కేటాయింపు
- ఆమోదించిన సీట్లు 10శాతం లోపే
- చట్టం ఆదేశాలు పట్టించుకోని యాజమాన్యాలు
- వైఎస్సార్‌సీపీ పాలనలో పక్కాగా ఆర్టీఈ అమలు

చిత్తూరు కలెక్టరేట్ : చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయడంలో విద్యాశాఖ అధికారులు అలసత్వం వహిస్తున్నారు. ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లల్లో ఈ చట్టం కచ్చితంగా అమలు చేయాల్సి ఉంది. అయితే రెండు జిల్లాల్లో కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులు చట్టానికి తూట్లు పొడుస్తున్నారు. స్కూళ్లు ప్రారంభించిన వెంటనే ఆర్‌టీఈ (విద్యాహక్కు చట్టం) కింద ఒకటో తరగతి అడ్మిషన్లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించారు. స్వీకరించిన అనంతరం ఆన్‌లైన్ లాటరీ విధానంలో విద్యార్థులకు పలు పాఠశాలల్లో ప్రవేశాలు కేటాయిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ ప్రవేశాల పత్రాలను తల్లిదండ్రులు తీసుకెళ్లి పాఠశాలల్లో ఇస్తుంటే అడ్మిషన్లు ఇచ్చేది లేదంటూ తిరిగి పంపించేస్తున్నారు. ఇదేమిటి ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయరెందుకు అని తల్లిదండ్రులు ప్రశ్నిస్తే....తమకు ఆర్‌టీఈ అడ్మిషన్ల జాబితానే ఇవ్వలేదంటూ పాఠశాలల నిర్వాహకులు సమాధానమిస్తున్నారు. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో 3978 సీట్లు కేటాయిస్తే అందులో 10 శాతం సీట్లను సైతం ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ప్రవేశాలు చేసుకోని దుస్థితి నెలకొంది.

వివరాలు గోప్యం?

దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న పేదలకు తప్పనిసరిగా విద్యాహక్కు చట్టం ద్వారా ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం అడ్మిషన్లు ఇవ్వాలి. ఆర్టీఈ ద్వారా కొన్నేళ్లుగా ప్రైవేటు పాఠశాలల్లో అడ్మిషన్ల ప్రక్రియను పాఠశాల విద్యాశాఖ చేపడుతున్నా.. వాటి వివరాలను మాత్రం గోప్యంగా ఉంచుతోంది. ఏటా అడ్మిషన్ల సమయంలో హడావుడి చేసే విద్యాశాఖ అడ్మిషన్ల ప్రక్రియ పూర్తయిన తర్వాత జిల్లాల వారీగా ఏయే పాఠశాలలో ఎన్ని ప్రవేశాలు కల్పించారనే వివరాలను మాత్రం వెల్లడించడం లేదు. ఇప్పటి వరకు ఆర్టీఈ ద్వారా కల్పించిన వివరాలు విద్యాశాఖ బయట పెట్టలేదు. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల ఒత్తిడితోనే వివరాలు బయటపెట్టడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

ఉచితమైనా లాగేస్తున్నారు..

చట్టం ప్రకారం ఒకటో తరగతిలో ఉచితంగా ప్రవేశం కల్పిస్తే పదో తరగతి వరకూ ఆ వెసులుబాటు ఉంటుంది. ఇవాళ ప్రైవేటు/ కార్పొరేటు పాఠశాలల్లో చూస్తే ఒకటో తరగతికి రూ.లక్ష లాగేస్తున్నారు. వాస్తవంగా లెక్కలు వేస్తే పాక్షిక ఉచితమనే విషయం బోధపడుతుంది. బస్సు, పుస్తకాలు, యూనిఫాం, షూ, టై, బెల్టు, బిల్డింగ్ ఫండ్, స్పెషల్ ఫీజు, ఐఐటీ, నీట్ ఇలా రకరకాల బాదుడు మామూలే. ఈ డబ్బులు ఆయా తల్లిదండ్రులు చెల్లించాల్సిందే. కేవలం ట్యూషన్ ఫీజులో మాత్రమే ఉచితం కాదుగానీ రాయితీ ఇస్తున్నారు. అయినప్పటికీ ఆర్టీఈ ప్రకారం అడ్మిషన్లు అనగానే యాజమాన్యాలు ఒకింత అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. కఠిన చర్యలు తీసుకొనే అవకాశం విద్యాశాఖ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు.

చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని ప్రైవేట్ పాఠశాలలు, విద్యార్థుల వివరాలు

యాజమాన్యం	పాఠశాలల సంఖ్య	విద్యార్థుల సంఖ్య
ప్రాథమిక	166	31,922
ప్రాథమికోన్నత	79	11,750
ఉన్నత	159	29,303
ప్రాథమిక, హైస్కూల్	18	6,074
ప్రాథమిక, హైస్కూల్ ప్లస్	06	5,929
జూనియర్ కళాశాలలు	66	19,327
మొత్తం పాఠశాలలు	2,984	2,60,641

ఆదేశాలు బేఖాతరు

విద్యా హక్కు చట్టం ప్రకారం 2025–26 విద్యా సంవత్సరానికి ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు కేటాయించిన 25 శాతం ఉచిత ప్రవేశాలకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విద్యాహక్కు చట్టం ప్రకారం ఆయా పాఠశాలల్లోని విద్యార్థుల సామర్థ్యానికి అనుగుణంగా ప్రభుత్వమే ఆన్‌లైన్ ద్వారా సీట్లు కేటాయిస్తుంది. దీనిని ఉల్లంఘిస్తే సుప్రీంకోర్టు ఆదేశాలను లెక్కచేయనట్టే. దీనిపై తీవ్రమైన చర్యలు తీసుకొనే అవకాశం ఉంటుంది. స్కూల్ అనుమతి రద్దు చేయడం జరుగుతుంది. అయితే పేదల సీట్ల విషయంలో అధికారులు ప్రైవేటు/ కార్పొరేటు స్కూళ్లను బతిమలాడుకోవాల్సి వస్తోంది.

ఆర్టీఈ ప్రవేశాలు పకడ్బందీగా అమలు చేయాలి



"ఆర్‌టీఈ అడ్మిషన్లు ఖరారు అయినప్పటికీ ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల నిర్వాహకులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. తమకు ఏ మాత్రం సంబంధం లేనట్టుగా వ్యవహరిస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఈ సమస్యను విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఏ మాత్రం స్పందించడం లేదు. ఫలితంగా నిత్యం తల్లిదండ్రులు విద్యాశాఖ కార్యాలయాల చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్నారు తప్ప న్యాయం మాత్రం జరగడం లేదు. చోద్యం చూస్తున్న విద్యాశాఖ అధికారులు ఆర్‌టీఈ ప్రవేశాలను పకడ్బందీగా అమలు చేయాలి.

– ప్రవీణ్‌కుమార్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి, చిత్తూరు జిల్లా

ఎగ్గొట్టేందుకు ఎత్తుగడ

వైఎస్సార్‌సీపీ పాలనలో ఆర్‌టీఈ అడ్మిషన్లను పకడ్బందీగా అమలు చేశారు. ప్రస్తుత కూటమి సర్కారు ఆర్‌టీఈ ప్రవేశాలను ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. విద్యాహక్కు చట్టం ప్రకారం పేదలకు సీట్లు కల్పించడానికి ఏటా వెబ్‌సైట్‌లో విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి. ఒకటో తరగతిలో ప్రవేశాలకు ఈ ఏడాది మే 27 నుంచి జూన్ 9 వరకు దరఖాస్తులు స్వీకరించారు. అడ్మిషన్లకు సంబంధించి ఆన్‌లైన్‌లో పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు దరఖాస్తు చేసుకున్నారు. రెండో దశ, మూడో దశ కూడా దరఖాస్తుల స్వీకరణ ఉంటుంది. ఆరు దశల వడపోత తర్వాత పాఠశాలను కేటాయిస్తారు. ఇలా కేటాయించిన తర్వాత సదరు స్కూల్‌కు విద్యార్థిని తీసుకొని తల్లిదండ్రులు వెళ్లి సీటు నిర్ధారణ చేసుకోవాలి. ఈ దశలోనే విద్యార్థుల తల్లిదండ్రులకు నరకం చూపిస్తున్నారు. కాస్త గట్టిగా నిలదీస్తే పని జరుగుతుంది. లేదంటే అంతే. ఆర్టీఈ ప్రకారం అడ్మిషన్లను సమగ్ర శిక్షా (ఎస్‌ఏ/ ఎస్‌ఎస్‌ఏ) చూసుకుంటోంది. సదరు అధికారులను స్కూలు యాజమాన్యాలు బురిడీ కొట్టిస్తున్నాయి.

విద్యాశాఖ అధికారులకే స్పష్టత కరువు

ఆర్‌టీఈ అడ్మిషన్ల ప్రక్రియపై జిల్లా విద్యాశాఖ, సమగ్రశిక్ష శాఖ అధికారులకే స్పష్టత లేని దుస్థితి. ఈ చట్టం ద్వారా ఎంత మంది విద్యార్థులకు అడ్మిషన్లు కల్పించారనే విషయంపై అధికారులు స్పష్టత లేదు. నిత్యం వందల మంది తల్లిదండ్రులు ఆర్‌టీఈ అడ్మిషన్ల విషయంపై విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు. అయినప్పటికీ ఎలాంటి స్పందన ఉండటం లేదు. దీంతో చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని విద్యార్థులు ఆర్‌టీఈ ప్రవేశాలు పొందినప్పటికీ తీవ్రంగా నష్టపోతున్నారు. గతేడాది ఒకటో తరగతిలో జాయిన్ చేసుకున్న చిత్తూరు నగరంలోని ఓ ప్రముఖ కిడ్స్ పాఠశాల.. ఈ ఏడాది మాత్రం ఏకంగా తమ స్కూల్‌లో ఒకటి, రెండు తరగతులు నిలిపివేశామని సెలవిచ్చింది. దీంతో ఆన్‌లైన్‌లో కేటాయింపు జరిగిన 18 మంది పిల్లల అడ్మిషన్లు అయోమయంలో పడ్డాయి. రెండు జిల్లాల్లో ఇలాంటి సమస్యలు మరెన్నో ఉన్నట్లు తెలుస్తోంది.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగినికి బురిడీ

- బాధితురాలి ఖాతా నుంచి రూ.2.18 లక్షలు చోరీ

తిరుపతి రూరల్ : ఆమె ఒక సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని.. సాంకేతిక పరిజ్ఞానం కలిగి ఉండి.. మారుతున్న కాలానికి తగినట్టుగా పరుగులు తీస్తున్న సాంకేతిక రంగంలో ఉద్యోగం చేస్తోంది.. అయితేనేం.. సైబర్ నేరగాళ్లు ఆమెను కూడా బురిడీ కొట్టించి ఆమె బ్యాంకు ఖాతా నుంచి రూ.2.18 లక్షలు దోచేసిన సంఘటన తిరుపతిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సాయినగర్ పంచాయతీ ఎంకే నాయుడు కాలనీలో వర్క్ ఫ్రం హోంగా విధులు నిర్వహిస్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని సైబర్ నేరగాళ్లకు చిక్కింది. తన వాట్సాప్ నుంచి పార్ట్ టైం జాబ్ కోసం లింకులు షేర్ చేసి రేటింగ్ ఇస్తే అమౌంట్ ఇస్తామని నమ్మించారు. గుర్తు తెలియని వ్యక్తి నుంచి వచ్చిన వాట్సాప్ మెసేజ్‌లకు స్పందించిన ఆ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని వారు చెప్పినట్టు మెసేజ్‌లు షేర్ చేస్తూ వచ్చారు. ఆపై తన బ్యాంకు ఖాతా వివరాలు తెలుసుకున్న సైబర్ నేరగాళ్లు ఆమె బ్యాంకు ఖాతా నుంచి మూడు బ్యాంకు అకౌంట్లకు రూ.2.18 జమ చేసినట్లయితే రెట్టింపు నగదు పంపుతామని నమ్మించారు. సైబర్ నేరగాళ్ల మాటలు నమ్మి వారు అడిగినంత డబ్బులు మూడు అకౌంట్లకు పంపించిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని మరో రెండు లక్షలు పంపాలంటూ డిమాండ్ చేయడంతో తాను మోసపోయానని తెలుసుకుంది. అనంతరం తిరుపతి రూరల్ పోలీసులను ఆశ్రయించగా సీఐ చిన్నగోవిందు కేసు నమోదు చేశారు.

అల్పాహారం తిని ప్రాణాపాయం



- జీసీ హాస్టల్‌లో కలుషిత ఆహారం
- 16 మంది విద్యార్థులకు అస్వస్థత



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి బీసీ హాస్టల్‌లో మంగళవారం ఉదయం కలుషిత ఆహారం తిని 16మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. బాధితులను వెంటనే హాస్టల్ వార్డెన్ పట్టణంలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. వివరాలు.. ఏర్పేడు మండలం పాపానాయుడుపేటలోని బీసీ హాస్టల్‌ను శ్రీకాళహస్తికి తరలించారు. అయితే నాలుగు రోజుల క్రితం జరిగిన బదిలీల్లో భాగంగా రేణిగుంట హాస్టల్ వార్డెన్ వెంకటేశ్వర్లుకు ఈ వసతిగృహం బాధ్యతలు అప్పగించారు. ఆయన మంగళవారం ఉదయం హాస్టల్‌కు వచ్చి విద్యార్థులతో పాటు అల్పాహారం భుజించారు. ఈ క్రమంలో విద్యార్థులు తీవ్రమైన కడుపు నొప్పితో బాధపడడంతో హుటాహుటిన ఆస్పత్రికి తీసుకెళ్లారు. సకాలంలో చికిత్సలందించడంతో పిల్లలు కోలుకున్నారు. ఫుడ్ పాయిజన్ కావడంతోనే విద్యార్థులు అస్వస్థతకు గురైనట్లు వైద్యులు వెల్లడించారు. వెంటనే చికిత్స చేయడంతో ప్రాణాపాయం తప్పిందని, లేకుంటే పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారేదని తెలిపారు. దీనిపై విద్యార్థులు మాట్లాడుతూ మూడు రోజుల కిందట చేసిన పిండితో ఈరోజు ఇడ్లీలు తయారు చేశారని ఆరోపించారు.



సీఐతో మాట్లాడుతున్న విద్యార్థి సంఘాలు

విద్యార్థి సంఘాల ఆందోళన

బీసీ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంలో ప్రభుత్వం విఫలమైందని పలు విద్యార్థి సంఘాల నేతలు మండిపడ్డారు. పిల్లల ఆరోగ్యంతో ఆటలాడడం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మూడు హాస్టళ్లకు ఒకే వార్డెన్ ఉండడం వల్లే ఈ దుస్థితి దాపురించిందని విమర్శించారు. ఈ క్రమంలోనే ఎంఈఓ బాలయ్య మాట్లాడుతూ ఈ ఘటనపై విచారణ చేపడతామన్నారు. వార్డెన్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేవలం మూడు రోజుల క్రితమే ఈ హాస్టల్ బాధ్యతలు చేపట్టానని తెలిపారు. రెండు రోజులుగా రేణిగుంట హాస్టల్‌లో అడ్మిషన్లు ఉండడంతో ఇక్కడకి రాలేకపోయానని చెప్పారు. గతంలో వార్డెన్‌గా పనిచేసిన రామయ్య ఇప్పటికీ పూర్తి చార్జ్ అప్పగించలేదన్నారు. అప్పటికీ పిల్లలు అస్వస్థతకు గురికాగానే వెంటనే ఆస్పత్రికి తరలించామని వివరించారు.

పిల్లలకు పరామర్శ

ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న విద్యార్థులను సీపీఐ ఏరియా కార్యదర్శి జనమాల గురవయ్య, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి కోగిల మునిచందు, జిల్లా విద్యార్థి సంఘం నేత కత్తి రవి తదితరులు పరామర్శించారు. వార్డెన్, వంటవాళ్ల నిర్లక్ష్యంతోనే పిల్లలు ప్రాణాపాయంలో పడ్డారని ఆరోపించారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి దీనిపై వెంటనే స్పందించాలని, రెగ్యులర్ వార్డెన్ పోస్టును తక్షణమే భర్తీ చేసేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అలాగే విద్యార్థులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కోరారు.

అధికారుల నిర్లక్ష్యంతోనే విద్యార్థులకు అస్వస్థత

ఎంపీ గురుమూర్తి ఆగ్రహం



తిరుపతి మంగళం : శ్రీకాళహస్తిలోని ప్రభుత్వ బాలుర బీసీ హాస్టల్‌లో అధికారుల నిర్లక్ష్యం కారణంగానే విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని తిరుపతి ఎంపీ గురుమూర్తి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కలుషిత ఆహారం కారణంగా పలువురు విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటనపై తిరుపతి పార్లమెంటు సభ్యుడు గురుమూర్తి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనలో సుమారు 16 మంది విద్యార్థులు అనారోగ్యానికి గురై శ్రీకాళహస్తి ఏరియా హాస్పిటల్‌కు తరలించిన విషయం తెలిసిన వెంటనే ఢిల్లీలో ఉన్న ఎంపీ ఫోన్ ద్వారా స్థానిక ప్రజా ప్రతినిధులతో మాట్లాడారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని దగ్గరుండి చూసుకోవాలని సూచించారు. అనంతరం జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారితో మాట్లాడిన ఎంపీ విద్యార్థులకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ ఘటనకు సంబంధించిన కారణాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ హాస్టళ్లలో పిల్లలకు అందించే ఆహారం విషయంలో నిర్లక్ష్య ధోరణి సహించరానిదన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు.

జాబ్‌మేళా పోస్టర్ల ఆవిష్కరణ



జాబ్‌మేళా పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

తిరుపతి సిటీ: ఎస్వీయూ స్టూడెంట్స్ అండ్ కల్చరల్ అఫైర్స్ విభాగం ఆధ్వర్యంలో జూలై 6న ఎంఆర్‌ఎఫ్ సంస్థ నిర్వహించనున్న ఉద్యోగ మేళా పోస్టర్లను మంగళవారం వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు ఆవిష్కరించారు. డిప్లొమో, ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులైన పురుష అభ్యర్థులు ఈ మేళాను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ మురళీధర్, డాక్టర్ పత్తిపాటి వివేక్, ఎంఆర్‌ఎఫ్ ప్రతినిధి వెంకటరామన్ పాల్గొన్నారు.

ఏపీపీజీఈసెట్ ఫలితాలు విడుదల



ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ పీజీసెట్‌లో 5వ ర్యాంకు సాధించిన విజయ్‌వర్మ

తిరుపతి సిటీ: ఆంధ్ర యూనివర్సిటీ ఈనెల 6 నుంచి 8వ తేదీ వరకు నిర్వహించిన ఏపీపీజీఈసెట్–2025 ఫలితాలు మంగళవారం విడుదల చేశారు. ఎంటెక్, ఎంఫార్మసీ కోర్సుల్లో 13 పీజీ సబ్జెక్టుల్లో ప్రవేశాల నిమిత్తం నిర్వహించే ఏపీపీజీసెట్‌కు ఎస్వీయూ రీజియన్ నుంచి 3,946 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా ప్రవేశ పరీక్షకు 3,434మంది హాజరయ్యారు. వీరిలో 3,208 మంది ఉత్తీర్ణత సాధించారు. జీఈఓ ఇంజినీరింగ్ అండ్ ఇన్ఫోమ్యాటిక్స్ విభాగంలో తిరుపతి జిల్లా సూళ్లూరుపేటకు చెందిన టి. సుధాకర్‌రెడ్డి రాష్ట్రస్థాయిలో 4వ ర్యాంకు సాధించగా, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగంలో తిరుపతికి చెందిన విజయ్‌వర్మ 5వ ర్యాంకు సాధించాడు.

క్లుప్తంగా

సన్నాహక రథయాత్ర



ఇస్కాన్ ప్రతినిధుల ఆధ్వర్యంలో రథయాత్ర

సూళ్లూరుపేట : సూళ్లూరుపేట పట్టణంలో ఇస్కాన్ ఆధ్వర్యంలో ఈనెల 28న నిర్వహించ బోయే పూరి జగన్నాథ రథయాత్ర ఏర్పాట్లలో భాగంగా మంగళవారం రథయాత్ర ట్రయల్ రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. నెల్లూరుకు ఇస్కాన్ అధ్యక్షుడు సుఖదేవ్ మహారాజ్ పర్యవేక్షణలో షార్ బస్టాండ్ నుంచి శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయ సమీపంలోని శ్రీనగర్ కాలనీ వరకు రథయాత్రను నిర్వహించారు. ట్రయల్ రన్‌లో ఇస్కాన్ టెంపుల్ ప్రతినిధులతో పాటు పట్టణ ప్రముఖులు పాల్గొని హరేరామ హరేకృష్ణ నామ స్మరణలతో నిర్వహించారు.

పశుగణాభివృద్ధిపై అవగాహన

కలువాయి(సైదాపురం) : పశుగణాభివృద్ధిపై రైతులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా లైవ్ స్టాక్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ అధికారి శ్రీనివాసులు కోరారు. మండల కేంద్రమైన కలువాయిలోని పశువైద్యశాలలో మంగళవారం పలు పథకాలపై రైతులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డీఎల్‌డీఏ ద్వారా పాడి రైతులకు వివిధ పథకాలను ప్రభుత్వం మంజూరు చేసిందని వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆర్‌జీఎం ద్వారా మారుమూల ప్రాంతాల్లో 20 వేలకుపైగా దున్నపోతులను పాడి రైతులకు ఉచితంగా అందిస్తామన్నారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది గురు జయంతి, కృష్ణమోహన్ తదితరులు ఉన్నారు.

వేధింపులపై కేసు నమోదు

కోట : మండలంలోని చంద్రశేఖరపురం గ్రామానికి చెందిన రజినీ అనే వివాహిత తన భర్త దిలీప్ అదనపు కట్నం కోసం వేధింపులకు గురి చేస్తున్నట్లు మంగళవారం ఎస్‌ఐ పవన్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

తుస్సు.. విద్యుత్ బస్సు



అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2021లో తిరుపతిలో కాలుష్య నియంత్రణలో భాగంగా జిల్లాకు మొట్టమొదటిగా 100 విద్యుత్ బస్సులను మంజూరు చేశారు. అయితే కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి నిర్వహణ ప్రశ్నార్థకంగా మారింది. మరమ్మతుకు గురైతే ఆ సర్వీస్‌ను పట్టించుకోవడం లేదు. 10 శాతానికి పైగా సర్వీసులు మూలకు పడ్డాయని విమర్శలున్నాయి. ఈ క్రమంలోనే ఎక్కడ పడితే అక్కడ ఆగిపోతున్నాయి. మంగళవారం తిరుమల బైపాస్ రోడ్డులోని శ్రీనివాసం సమీపంలో ఓ విద్యుత్ సర్వీస్ నడిరోడ్డుపై ఆగిపోయింది. దీంతో బస్సులోని ప్రయాణికులు దిగి బస్సును తోయాల్సిన పరిస్థితి వచ్చింది. ఈ క్రమంలో పెద్ద ఎత్తున ట్రాఫిక్ ఆగిపోవడంతో ప్రయాణికులకు తిప్పలు తప్పలేదు. –సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

అంతా మా ఇష్టం.. ధరలు చెప్పం!

జిల్లాలో పల్ప్ గుజ్జు పరిశ్రమదారులు సిండికేట్ అయ్యారు. మామిడి రేటును చెప్పకుండా నాన్చుతున్నారు. ఇన్నాళ్లు రూ.8 నుంచి రూ.5 వరకు పాటపాడారు. తీరా కూటమి ప్రభుత్వం పరువుపోతోందని నోటిమాటగా అమలవుతున్న మద్దతు ధరకు తాళం వేసేశారు. దీని దెబ్బకు రెండు రోజులుగా మామిడిరేట్లు మూగబోయాయి. రైతులకు ఇస్తున్న బిల్లుల్లో తూకం వివరాలు మాత్రమే దర్శనమిస్తున్నాయి. ధర వివరాలను ప్రస్తావించకపోవడంతో రైతులు అయోమయంలో పడ్డారు.

జిల్లాలో మ్యాంగో ఫ్యాక్టరీలు సిండికేట్

- ఇన్నాళ్లు తోతాపురి కిలో రూ. 8, రూ.6, రూ.5 అంటూ ప్రచారం
- ప్రస్తుతం ధరలు చెప్పని వైనం
- అయోమయంలో రైతులు



తోతాపురి కాయలు

కాణిపాకం/తిరుపతి రూరల్ : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 43 మామిడి గుజ్జు పరిశ్రమలున్నాయి. ఇందులో 31 ఫ్యాక్టరీలు తెరుచుకున్నాయి. ఇవీ ఈనెల 6 నుంచి తోతాపురి కొనుగోలును ప్రారంభించాయి. ఫ్యాక్టరీలు తోతాపురి కేజీ రూ.8కి కొనుగోలు చేయాలని కూటమి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వం తరఫున కేజీకి రూ.4 చొప్పున రైతులకు ప్రోత్సాహక నిధి ఇస్తామని పాట పాడింది. ఫ్యాక్టరీలు టోకన్లు జారీచేసి కాయలు కొనుగోలు చేసేందుకు శ్రీకారం చుట్టాయి. అయితే ఈటోకన్ల జారీ గందర గోళంగా మారడంతో ఫ్యాక్టరీలు చేతులెత్తేశాయి. మధ్యలో పోలీసులు, అధికారులు కల్పించుకుని రైతులందరికీ టోకెన్లు ఇప్పించే ప్రయత్నాలు చేశారు.



తిరుచానూరు : మామిడికాయలను పారబోసిన రైతులు

కొనేవారేరీ?

టోకన్ల గోల ముదరడంతో అధికారులు కొత్తపల్లవి అందుకున్నారు. ఇకపై టోకన్లు అవసరం లేదని ప్రకటించారు. కాయలు కోత కోసి ఫ్యాక్టరీ వద్దకు తీసుకెళితే తీసుకుంటారని ప్రచారం చేస్తున్నారు. ఈ ప్రచారంతో ఫ్యాక్టరీలు కాయలు కొనలేమని బోర్డులు పెట్టేస్తున్నాయి. కాయలు కోసి తెచ్చిన వారిని తిప్పి పంపిచేస్తున్నాయి. లేకుంటే ఐదు రోజుల తర్వాత వరస నంబరు వేసి రైతు ఫలాన్ని మట్టిపాలు చేస్తున్నాయి. సిఫార్సులుంటే అప్పటికప్పుడే దింపుకుంటున్నాయి. మామిడి విపత్తును అదునుగా తీసుకుని ఫ్యాక్టరీలు సిండికేట్ అయ్యాయి. మామిడి రైతులను దెబ్బ తీసేందుకు కుట్రలు పన్నుతున్నాయి.

ధర ఎంత?

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 13 వేల మంది రైతుల వరకు సుమారు 1.5 లక్ష టన్నుల మామిడి కాయలు ఫ్యాక్టరీకి తరలించినట్లు అధికారులు చెబుతున్నారు. వీరిలో తొలుత వచ్చిన రైతులకు ఫ్యాక్టరీ నిర్వాహకులు తోతాపురి కేజీ ధర రూ.8ని రుచిచూపించారు. కొన్ని రోజుల తర్వాత వచ్చిన రైతులకు కేజీ ధర రూ.6ని తీసుకున్నారు. మరికొన్ని రోజుల తర్వాత వచ్చిన రైతులకు రూ.5ని చెప్పి ముఖం చాటేశారు. ఇప్పుడు ఫ్యాక్టరీలు రైతులకు పెద్ద షాక్ ఇస్తున్నాయి. తోతాపురి ఎంతకు కొనుగోలు చేస్తున్నాయో చెప్పడం లేదు.



జాతీయ రహదారి పక్కన మామిడిని పడేసిన పదిపుట్ల బైలుకు చెందిన రైతు

గుండె గు'బిల్లు'

ఈనెల 6వ తేదీ నుంచి ఇప్పటి వరకు కొనుగోలు చేసిన ఏ ఒక్కరైతుకు కూడా బిల్లులో ఫ్యాక్టరీలు ధరల విషయాన్ని ప్రస్తావించ లేదు. కేవలం కాయలు, ట్రాక్టర్ లోడింగ్‌తో సహా ఎంత బరువు ఉంది.. ఖాళీ ట్రక్కుతో ఎంత బరువు ఉంది.. అని మాత్రమే బిల్లుల్లో ప్రస్తావిస్తున్నారు. ధర విషయాన్ని ఖాళీగా చూపుతున్నారు. ధరలు చెప్పకపోవడం ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు.



ఫ్యాక్టరీలో మామిడి కాయల క్లీనింగ్ టబ్



గుజ్జు ప్యాకింగ్



దామల చెరువు మండీల వద్ద చెత్త కుప్పల్లో పడేసి వెళ్లిన మామిడి పండ్లు

బారులు తీరిన ట్రాక్టర్లు

గుడిపాల సరిహద్దులోని ఓ ఫ్యాక్టరీ నుంచి తమిళనాడులోని కాట్పాడి కింగ్‌స్టన్ కాలేజీ వరకు మామిడి కాయల ట్రాక్టర్లు క్యూకట్టాయి. గత మూడు రోజులుగా ఈ సమస్య తీవ్రతరమవుతోంది. అన్‌లోడింగ్‌కు రైతులు రోడ్డుపైనే కాపు కాస్తున్నారు. తిండీలేక తిప్పలు పడుతున్నారు. గుడిపాలలోని కొత్తపల్లి వద్ద ఇదే పరిస్థితి ఎదరవుతోంది. జీడీనెల్లూరు మండలం ఎట్టేరి వద్ద ఉన్న ఫ్యాక్టరీ వద్ద కూడా మూడు కి.మీ మేర ట్రాక్టర్లు నిలిచిపోయాయి. ఇక్కడ కాయలు అన్‌లోడింగ్‌కు ఐదు రోజులకు పైనే పడుతోంది. దీని దెబ్బకు ఆయా ఫ్యాక్టరీల నిర్వాహకులు కాయలు కొనలేమని చేతులెత్తేశారు. చిత్తూరు మండలం చెర్లోపల్లి ప్రాంతంలో ఉన్న ఫ్యాక్టరీ సైతం మామిడి కొనుగోలు చేయలేమని బోర్డు పెట్టేస్తున్నాయి. పూతలపట్టు, బంగారుపాళ్యం, తవణంపల్లి, కార్వేటినగరం తదితర ప్రాంతాల్లో కూడా ఈ రకంగా ఫ్యాక్టరీలు రైతులను వేధిస్తున్నాయి.

ధరల బోర్డు పెట్టాలి కదా..?



ఇంత ఘోరం ఎప్పుడూ చూడలేదు. మా కడుపు మంట ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదు. విధిలేని పరిస్థితుల్లో కాయలు దింపుకుంటే చాలనుకుంటున్నాము. దీన్ని అదునుగా చేసుకుని ఫ్యాక్టరీలు ఇప్పుడు ఎంతకు కొంటున్నాయో కూడా చెప్పడం లేదు. బయట మాత్రం కాయలు కొనలేం.. టోకన్లు ఇవ్వలే మని బోర్డులు పెడుతున్నారు. ధరలపై కూడా బోర్డు పెట్టాలి కదా. దీనిపై అధికారులు కూడా నోరు విప్పడం లేదు.

–గోవర్ధన్, పెనుమూరు మండలం

'ఉపాధి' అక్రమాలపై వేటు

- ముగ్గురు ఉద్యోగుల సస్పెన్షన్
- రూ.3,51,585 రికవరీకి ఆదేశాలు



పీడీకి వివరణ ఇస్తున్న ఉపాధి సిబ్బంది

రేణిగుంట : గత సంవత్సర కాలంలో జరిగిన ఉపాధి హామీ పనులకు సంబంధించి జరిపిన సామాజిక తనిఖీల్లో ఉపాధి అక్రమాలు బయటపడ్డాయి. డ్వామా పీడీ ముగ్గురు సిబ్బందిని సస్పెండ్ చేసి, రూ.3,51,585 రికవరీకి ఆదేశాలు ఇచ్చారు. రేణిగుంట మండలంలోని 19 పంచాయతీల్లో గత సంవత్సరం ఏప్రిల్ 1 నుంచి ప్రస్తుత సంవత్సరం మార్చి 31వ తేదీ వరకు జరిగిన ఉపాధిహామీ పనులపై 15 రోజులుగా సామాజిక తనిఖీలు నిర్వహించారు. అందులో భాగంగా మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో డ్వామా పీడీ శ్రీనివాస్ ప్రసాద్ రావు అధ్యక్షతన సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహించారు. పంచాయతీ వారిగా తనిఖీ బృందం నివేదికలను సభ దృష్టికి తీసుకొని వచ్చారు. సామాజిక తనిఖీ బృందం ఇచ్చిన నివేదిక ప్రకారం రూ.1,37,500 రికవరీ, రూ. 2,14,085 జరిమానా విధించారు. అక్రమాలకు పాల్పడిన టెక్నికల్ అసిస్టెంట్, ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్‌లను సస్పెండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ టి ఎమ్ లోకేశ్వర్ రెడ్డి, ఏపీడి వరప్రసాద్,ఇన్చార్జ్ ఎంపీడీవో ప్రభురావు, గత ఎంపీడీవో విష్ణు చిరంజీవి, అసిస్టెంట్ విజిలెన్స్ ఆఫీసర్ గణేష్ కుమార్, ఏపీఓ దీప, గత ఏపీవో జ్యోతి శ్రీ, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు

- యువకుడి దుర్మరణం, మరొకరికి తీవ్ర గాయాలు



మృతి చెందిన గుణశేఖర్



తీవ్ర గాయాలతో శశికుమార్

నారాయణవనం/కేవీబీపురం : మండలంలోని జాతీయ రహదారిపై వేగంగా వస్తున్న కారు బైక్‌ను ఢీకొట్టిన ఘటనలో కేవీబీపురం మండలానికి చెందిన గుణశేఖర్(21) మృతి చెందగా శశికుమార్(19) తీవ్ర గాయాలతో తిరుపతిలో చికిత్స పొందుతున్నాడు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కేవీబీపురం పాతపాళ్యంకు చెందిన గుణశేఖర్, శశికుమార్ బైక్‌పై పుత్తూరు వెళ్లడానికి పాలమంగళం మీదుగా మండలంలోని 716–ఎ జాతీయ రహదారిపై ఐఆర్ కండ్రిగ క్రాస్‌ను దాటారు. అదే సమయంలో తిరుపతి నుంచి చెన్నైకి వెలుతున్న కారు బైక్‌ను ఢీకొట్టింది. కారు వేగానికి బైక్ 10 మీటర్ల మేరకు ఈడ్చుకెళ్లినట్లు స్థానికులు తెలిపారు. ప్రమాదంలో బైక్ నడుపుతున్న గుణశేఖర్‌కు కాళ్లు, చేయి విరిగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. బైక్ వెనుక కూర్చున్న శశికుమార్ తీవ్ర గాయాలు పాలయ్యాడు. బాధితులను పుత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కొన ఊపిరితో ఉన్న గుణశేఖర్ అప్పటికే మృతి చెందాడని వైద్యులు ధ్రువీకరించారు. తీవ్ర గాయాలైన శశికుమార్‌కు మెరుగైన వైద్య కోసం తిరుపతికి తరలించారు. కారులో ప్రయాణిస్తున్న డ్రైవర్‌తో పాటు మరొక వ్యక్తి బైక్‌పై పరారీ అయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. కారును స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు.

పిల్లలను చదువుకు దూరం చేయొద్దు



కోతలగుంట పాఠశాల వద్ద నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

చిట్టమూరు : మండల పరిధిలోని ఈశ్వరవాక పంచాయతీ కోతలగుంట గ్రామస్తులు తమ పిల్లలను చదువుకు దూరం చేయొద్దని మంగళవారం పాఠశాల వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ.. గ్రామంలోని ప్రాథమిక పాఠశాల్లోని 3,4,5 తరగతుల విద్యార్థులను మోడల్ స్కూల్‌కు వెళ్లి చదువుకోవాలని చెబుతున్నారని, అక్కడికి 7 కిలోమీటర్ల దూరం ఉందన్నారు. ఈ మార్గంలో బస్సు సౌకర్యం గాని, ఆటోలు కూడా రావని ఆందోళన వ్యక్తం చేశారు. ఉన్నట్టుండి గ్రామంలోని బడి మార్పు చేస్తే తమ పిల్లలు చదువుకు దూరమవుతారని ఆవేదన వ్యక్తం చేశారు.

పాఠశాలను పునరుద్ధరించాలి



నాకు ఇద్దరు అమ్మాయిలు ఉన్నారు. 4,5 తరగతులు చదువుతున్నారు. వారిని రోజూ మోడల్ స్కూల్‌కు తీసుకెళ్లాలంటే ఇబ్బందిగా ఉంది. ప్రత్యామ్నాయ మార్గం చూపాలి. లేదంటే గ్రామంలోని పాఠశాలను పునరుద్ధరించాలి.

– చోడవరం భవాని, విద్యార్థిని తల్లి, కోతలగుంట

ఇబ్బందులు పడుతున్నాం



నాకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. నేను ఉద్యోగ రీత్యా వేరే గ్రామానికి రోజు వెళతాను. అయితే గ్రామంలో బడి ఉన్నప్పుడు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఉండేది. ఇప్పుడు ఎల్లసిరి గ్రామానికి పాఠశాల మార్చడంతో ఇబ్బందులు పడుతున్నాం.

– కావేరి, విద్యార్థిని తల్లి, కోతల గుంట

రౌడీషీటర్ దారుణహత్య



ప్రవీణ్‌కుమార్ మృతదేహం

చిల్లకూరు : చిల్లకూరు వడ్డిపాళెంకు చెందిన ప్రవీణ్‌కుమార్, సుబ్రహ్మణ్యం అనే ఇద్దరు పాత నేరస్థుల మధ్య నెలకొన్న కుటుంబ వివాదాల కారణంగా ప్రవీణ్‌కుమార్‌ను గొంతు కోసి హత్య చేసిన ఘటన చిల్లకూరులోని మేదర కాలనీలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం.. చిల్లకూరు వడ్డిపాళెంకు చెందిన ప్రవీణ్‌కుమార్ (25) పాల ఆటో నడుపుతున్నాడు. మద్యానికి బానిసై చిల్లర పనులు చేస్తూ ఇటీవల నాంచారమ్మపేటలో జరిగిన ఓ హత్య కేసులో నిందితుడిగా తేలాడు. రౌడీ షీటర్‌గా పోలీస్ రికార్డులో నమోదై ఉన్నాడు. వడ్డిపాళెం ప్రాంతానికే చెందిన సుబ్రహ్మణ్యం కూడా గతంలో నేరాలకు పాల్పడి గ్రామం వదలి శ్రీకాళహస్తి సమీపంలో ఉండే పాపానాయుడుపేటలో ఉంటున్నాడు. కొంత కాలం క్రితం సుబ్రహ్మణ్యం మేనమామ కుమార్తెను ప్రవీణ్‌కుమార్ ప్రేమించాడు. ఆ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఆమెకు మరొకరితో వివాహం జరిపించారు. ప్రవీణ్‌కుమార్ ఆమె వివాహానంతరం కూడా ఆమెతో మాట్లాడేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలియడంతో సుబ్రహ్మణ్యం పది రోజుల క్రితం వడ్డిపాళెంకు వచ్చి ప్రవీణ్‌కుమార్‌తో వివాదానికి దిగాడు. సుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులు జోక్యం చేసుకుని అతనిని అక్కడి నుంచి పంపించి వేశారు. ఆ తరువాత సుబ్రహ్మణ్యం మంగళవారం మరోసారి నేరుగా వడ్డిపాళెంకు చేరుకుని ప్రవీణ్‌కుమార్‌తో గొడవకు దిగాడు. సుబ్రహ్మణ్యం మేనమామ అతనిని అక్కడి నుంచి పంపించేశారు. అతను చిల్లకూరులో మద్యం తాగి తిరిగి వస్తున్న క్రమంలో ప్రవీణ్‌కుమార్ ఎదురు రావడంతో అతడిపై దాడి చేశాడు. ఆపై మేదర కాలనీలోకి తీసుకొచ్చి అక్కడ కత్తితో గొంతు కోశాడు. ప్రవీణ్‌కుమార్ కొంత దూరం వెళ్లి అక్కడే మృతి చెందాడు. నిందితుడు సమీపంలో ఉన్న పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. గూడూరు రూరల్ సీఐ కిషోర్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని స్థానికులతో పాటుగా మృతుడి తల్లి పుష్పమ్మ నుంచి ఫిర్యాదు తీసుకుని మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

పైపులైన్ పనులపై వివాదం

- కేవలం బిల్లులు చేసుకునేందుకే పనులు !



గ్రామంలో ఏర్పాటు చేసిన పైపులైను



మహిళలపైకి దూసుకొస్తున్న నాగరాజ నాయుడు

పాకాల : పైపులైను ఏర్పాటు చేయడంపై మండలంలోని దామలచెరువులో వివాదం చోటు చేసుకుంది. మంగళవారం స్థానికులు తెలిపిన వివరాల మేరకు మసీదు వీధి, జనపవీధి, సందు వీధులలో సుమారు 1500 మంది ప్రజలు నివసిస్తున్నారు. గతంలో ఉన్న పైపులైన్‌లో నీరు బాగా వస్తుందని, ప్రస్తుతం ఏర్పాటు చేసిన పైపులైనులో నీరు సరిగ్గా రాదని చెబుతున్నా తెలుగు తమ్ముళ్లు దౌర్జన్యంగా పైపులైను ఏర్పాటు చేశారని ఆవేదన చెందారు. పైపులైను ఏర్పాటు చేయడంలో వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులకు నీరు రాకుండా చేయడానికి కక్ష సాధింపు చర్యలలో భాగంగానే పైపులైను ఏర్పాటు చేశారని స్థానిక మహిళలు కన్నీటి పర్యంతం అయ్యారు. ఈ విషయంపై ప్రజలకు న్యాయం చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎఈ నవీన్‌ని స్థానిక మహిళలు వేడుకున్నా టీడీపీ నాయకులతో మాట్లాడుకోవాలని ఉచిత సలహా ఇచ్చారు.

టీడీపీ నేతల దౌర్జన్యం

దామలచెరువులో పైపులైను సమస్యపై బయట గ్రామాల నుంచి నాయకులను పిలిపించుకుని స్థానిక మహిళలను భయభ్రాంతులకు గురిచేశారు. నేండ్రగుంటకు చెందిన టీడీపీ మండల అధ్యక్షుడు నాగరాజ నాయుడు మహిళలపైకి దూసుకొచ్చి దౌర్జన్యానికి దిగాడని ఆరోపించారు. ముస్లిం మహిళలు అని కూడా చూడకుండా వీరంగం సృష్టించాడని స్థానిక మహిళలు తెలిపారు. కేకలు వేస్తూ సుమారు 100 మంది అల్లరి మూకలతో గొడవ చేసి మహిళలకు తీవ్ర ఇబ్బందులు కలిగించారని వాపోయారు. బయట నుంచి అల్లరి మూకలు ఎందుకు వచ్చారని స్థానిక మహిళలు, మాజీ ఎంపీటీసీ పి.హసీనా ప్రశ్నించారు.

ప్రేక్షకపాత్రలో పోలీసులు

దామలచెరువులో నీటి పైపులైను సమస్యపై బయట నుంచి వచ్చిన అల్లరి మూకలు, రౌడీలు, నాయకుల దౌర్జన్యానికి పాల్పడుతున్నా పోలీసులు అడ్డుకోకపోగా ప్రేక్షకపాత్ర వహించారని స్థానిక మహిళలు ఆరోపించారు.

తల్లి మృతిని తట్టుకోలేక కొడుకు బలవన్మరణం



జ్యోతిలింగం మృతదేహం

తడ : అల్లారు ముద్దుగా పెంచిన తల్లి అనారోగ్య కారణంతో తిరిగిరాని లోకాలకు చేరుకోవడంతో మనస్తాపం చెందిన కుమారుడు బలవన్మరణానికి పాల్పడ్డ ఘటన కారూరు గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ కొడవనాయుడు తెలిపిన వివరాల మేరకు కారూరు గ్రామానికి చెందిన ఆంబాకం మునుస్వామి, గుజాల దంపతులకు ఇద్దరు కుమారులు. ఆరు నెలల క్రితం గుజాల అనారోగ్యంతో మృతి చెందింది. అప్పటి నుంచి ఆమె పెద్ద కుమారుడు జ్యోతిలింగం(20) మనో వేదనతో ఉంటూ వచ్చాడు. శ్రీసిటీలోని ఓ పరిశ్రమలో పని చేస్తున్న అతను ఈనెల 21వ తేదీ శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుమందు తాగి పరిశ్రమ వద్దకు చేరుకున్నాడు. పరిశ్రమ గేటు ఎదుట అపస్మారక స్థితిలో పడిపోవడంతో తోటి సిబ్బంది గమనించి తొలుత గుమ్మిడిపూండి ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో చెన్నైలోని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి చనిపోయాడు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నవధాన్యాల సాగుతో సారవంతం



బయో రిసోర్స్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న కొండయ్య

తడ : భూమిని సారవంతంగా మార్చేందుకు వివిధ రకాల నవధాన్యాలు సాగు చేసి, పూత దశలో భూమిలో కలియ దున్నడం వల్ల భూమి సారవంతంగా మారుతుందని, తద్వారా భూమిలో సేంద్రియ కర్బన శాతం పెరగడం ద్వారా అధిక దిగుబడులు పొందవచ్చని తిరుపతి జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారి స్వామి కొండయ్య రైతులకు సూచించారు. వెండ్లూరుపాడు గ్రామంలో పర్వతరెడ్డి కిషోర్‌రెడ్డి అనే ప్రకృతి వ్యవసాయ రైతు తన ఇంటి వద్దే ఏర్పాటు చేసిన బయో రిసోర్స్ సెంటర్‌ను కొండయ్య మంగళవారం ప్రారంభించారు. ప్రతి రైతుకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ఉండాలని కోరారు. బియ్యం, చిరుధాన్యాలు వంటివి వివిధ రకాల ఉత్పత్తులను వినియోగదారులకు బయో రిసోర్స్ సెంటర్ ద్వారా అందుబాటులోకి తీసుకొస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో తిరుపతి బయో రిసోర్స్ యంటీ సత్యనారాయణ, యూనిట్ ఇన్ చార్జులు రమణ, శ్రీనివాసులు, మారెయ్య, నిర్మల, సంజీవయ్య పాల్గొన్నారు.